


“ఎదురింటి కాశీ పోర్షనులోకి ఎవరో వచ్చి దిగినట్టున్నారు” అన్నాను కిటికీలోంచి బయటకు చూస్తూ.

కిటికీలో షేవింగ్ సరంజామా పేర్చుకుని అద్దంలో నా ప్రతిబింబం మీద దృష్టిని సారించబోగా, ఎదురుగా వున్న ఆ పోర్షను

ముందు భాగంలో ముగ్గులు పెడుతూ ఓ ఇరవై ఏళ్ళ ఆడపిల్ల కనబడింది. ఆ అమ్మాయి మొహం అటువైపుకు తిరిగి వుంది.

"నిన్న మీరు ఆఫీసుకు వెళ్ళిం తరువాత, పన్నెండు ప్రాంతంలో కాబోలు ఓ త్రీ వీలర్‌లో సామాను వేసుకుని వచ్చారు" అంది కమల.

ముగ్గు వెయ్యటం అయిపోయి నట్టుగా వుంది. ఓ ప్రక్కగా నిల బడి తుదిమెరుగులకోసం కాబోలు మరోసారి వేసిన ముగ్గునే పరిశీ లించసాగింది ఆ అమ్మాయి.

పల్చటి పిల్క లంగా, పువ్వుల జాకెట్టు, తెల్లని ఓణీ! పొడుగాటి జడ, జడలో వాడిన మల్లెపూల దండ! ఆమె మొహం లో వాడని యవ్వనపు తొలిదశ!

అంతకు మించి ఎక్కువగా అంచనాకి అందలేదు.

"ఆ ఇంటిలో ఎక్కువమంది వున్నట్టు లేరే!" అన్నాను గడ్డానికి సబ్బు పట్టిస్తూ.

"అవును. ఇద్దరే వచ్చారు. ఆ అమ్మాయి, ఇంకో అబ్బాయి! సామాను కూడా ఎక్కువ లేదు."

"చిన్న ఫామిలీ కాబోలు. కొత్త సంసారం అయి వుంటుంది" అన్నాను.

"చిన్న ఫామిలీయే కానీ, కొత్త సంసారం కాదు. ఆ అమ్మాయికి పెళ్ళి అయినట్లుగా లేదు. లంగా, వోణీ వేసుకుంది. మీరు గమనించ లేదా?"

"నిజమే! ఇప్పుడు గుర్తు వచ్చింది. మరి అతను ఎవరు అయి వుండాలి?"

"అన్నయ్య కావచ్చు. అతను ఇక్కడ ఏదో ఉద్యోగం చేస్తుంటే అతనికి వండి పెట్టటంకోసం చెల్లెలను తీసుకొని వచ్చి వుండ వచ్చు."

"చక్కగా ముచ్చటగా వుంది. ఎవరింటికి కోడలుగా వెళుతుందో గానీ, ఆ ఇల్లు కళకళలాడి పోతుంది."

కమల ప్రక్కన నిలబడి వుండగానే ఆ అమ్మాయిని తదే కంగా చూడటం క్షేమం కాదని షేవింగ్‌లో బిజీ అయిపోయాను.

మరో పావుగంటకు నా షేవింగ్ పూర్తి అయింది. కాని ఆ అమ్మాయి ఇంకా ముగ్గులు దిద్దు తూనే వుంది. దాదాపు అరగంట నుంచి ఆమె అదే పనిలో వుంది.

గుమ్మం ముందు నాలుగు గీతలు గీసి చిన్న ముగ్గు వెయ్యటానికి మూడు నిముషాలు చాలు. అలాం టిది అంత సమయం ఆ పనికి వృథాచేస్తే,మిగతా గృహ కృత్యాలు

ఎప్పటికి అయ్యేను?

వారం రోజులు గడిచాయి.

ప్రతిరోజూ ఉదయం ఆ అమ్మాయి దాదాపు గంటసేపు ముగ్గులు పెట్టాలన్నా అందుకు కావలసినంత ఖాళీ స్థలం లేదు. మరి ఏం చేస్తున్నట్టు? వేసిన ముగ్గు చెరిపి మళ్ళీ వేస్తూం దనుకోవాలా?

ఇదే విషయం కమలని అడిగాను.

"పెళ్ళికాని పిల్లలకు బట్టలన్నా ముగ్గులన్నా అలాగే మోజు వుంటుంది" అంటూ ఒక్క ముక్కలో తేల్చి పారవేసింది.

* * *

ఒకరోజున ఏదో పనిలోవున్న నేను కంగారుపడేలా, "అడుగో- అతనే ఆ అమ్మాయి అన్న!" అంది కమల-పెద్ద గొంతుతో కిటికీలోంచి బయటకు చూస్తూ.

నేను గబగబా వచ్చి ఆమె పక్కన నిలబడ్డాను.

అతని చేతిలో జిప్‌బాగ్ వుంది. ఎక్కడికో వెళ్తున్నట్టున్నాడు. వెళ్ళబోయేముందు చెల్లెలుకు ఏదో చెబుతున్నాడు. అతని వయసు ఇరవై ఎనిమిది, ముప్పైకి మధ్య వుంది. పచ్చగా, ఆరోగ్యంగా వున్నాడు.

* * *

"ఏమండోయ్! మన ఎదురింటిలో వుండే ఆ అమ్మాయి పేరు జయశ్రీట!" అంది కమల నాతో-ఆఫీసునుంచి ఇంటికి రాగానే.

వాళ్ళు వచ్చిన పదిరోజులలో కమల కష్టపడి తెలుసుకో గలిగింది అంతే! అందుకే తానేదో సాధించినట్టుగా ఆరాటం!

వింటున్నట్టుగా తల ఆడించి బట్టలు మార్చుకో సాగాను.

"జయశ్రీ లాంగ్‌షాట్‌లో చిన్నపిల్లలా వుంది కానీ, దగ్గరనుంచి చూస్తే కనీసం ఇరవై ఆరు ఏళ్ళు వుంటా యనిపిస్తూంది" అంది కమల.

కమల మా బజారులోనే వుండే ఫిలిం ప్రొడ్యూసరు కృష్ణమోహన్ గారింటికి వెళ్ళి రోజూ ఓ రెండు గంటలు వాళ్ళ పిల్లలకు ట్యూషన్ చెప్పివస్తుంది. ఆమె ఈ ట్యూషను చెప్పటం మొదలుపెట్టిన తరువాత, ఆ ఇంటి ప్రభావం కాబోలు లాంగ్‌షాట్, క్లోజప్ అంటూ సినిమా భాష వాడటం మొదలు పెట్టింది.

"అయితే, జయశ్రీ నీకు క్లోజప్‌లో ఎప్పుడు కనబడింది? వాళ్ళ ఇంటికి వెళ్ళావా?"

"లేదు. ఇందాక వీధిలోకి కూరగాయల బండి వచ్చింది. నేను కూరగాయలు కొంటుంటే తనూ

కొనటానికి వచ్చింది. అప్పుడు గమనించాను."

* * *

మరో రోజున—

"ఏమిటి? ఇవాళ ట్యూషనుకు వెళ్ళటం లేదా?" అన్నాను-కమల ఈ సమయంలో ఇంట్లోనే వుండటం చూసి.

"లేదు."

"అదేం?"

"ఇవాళ కృష్ణమోహన్ గారు మద్రాసు నుంచి మార్నింగ్ ఫ్లైట్‌లో వచ్చారు. పిల్లలిద్దరూ తండ్రి వచ్చిన సంబరంలో వుండి పోయారు. ఆయన మళ్ళీ మద్రాసు బయలుదేరేవరకూ వాళ్ళకు చదువు ఎక్కదు."

"బాగుంది నీ వరస! జీతం తీసుకుంటున్నప్పుడు, వాళ్ళు చదివినా, చదవకపోయినా వెళ్ళి చెప్పి రావాలి గదా!"

"నిజమే....కానీ వాళ్ళు వచ్చి నా ముందు కూర్చోవాలి గదా! ఆ తండ్రితోపాటు ఓ డజను మంది సినిమా మనుషులు వస్తారు. ఈ పిల్లలకి ఆ హీరో హీరోయిన్లతో కాలక్షేపం!"

ఇది ఒకప్పుడు హౌసింగ్ బోర్డు వాళ్ళు కట్టిన కాలనీ అయినందువల్ల ఈ చివరి నుంచి ఆ చివరి వరకు ఇళ్ళు అన్నీ ఒక్కలాగే వుంటాయి. ఈ మధ్య కొన్నిటికి మార్పులు చేర్పులు జరిగినప్పటికీ, పెద్ద తేడా కనబడదు.

ఈ కాలనీలో అంతా మధ్య తరగతి వారే అయినా, చుక్కల్లో చంద్రుడిలా కృష్ణమోహన్, ఆయన రెండంతస్తుల మేడ మా కాలనీకి ప్రత్యేకతలు!

దాదాపు వారం రోజులు వరసగా కమల ట్యూషన్‌కి వెళ్ళనవసరంలేక పోయింది. అయితే, ఈ వారం రోజులూ తన కొత్త స్నేహితురాలు జయశ్రీతో కాలక్షేపం చేయసాగింది.

ఆ రోజున నేను ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి—"ఏమండోయ్! మనం వూహించింది కరక్ట్ కాదు" అంది-మొహంలో ఆశ్చర్యంలో కూడిన భావప్రకటన చేస్తూ.

"ఏది కరక్ట్ కాదు?"

"వాళ్ళిద్దరు అన్నా చెల్లెళ్ళు కాదుట!"

"మరి!?"

"మొగుడూ పెళ్ళాలు!"

నాలో అంతులేని ఆశ్చర్యం! వెంటనే తేరుకుని, "మరి మెడలో మంగళ సూత్రం, కాళ్ళకు మట్టెలు లాంటివి కనబడవేమిటి?

అదీకాక చిన్న పిల్లలా ఆ లంగా ఓణీ....” అన్నాను.

“చిన్నపిల్ల అంటే గుర్తు వచ్చింది. జయశ్రీకి మూడేళ్ళ బాబు వున్నాడట. పిల్లవాడిని వాళ్ళ అమ్మగారింటిలో వుంచిందట. ఆమెకు సెవ్వయి అయిదేళ్ళు అయిందట!” అంది కమల.

“ఇదంతా నీ వూహేనా లేక నిజమేనా?”

“అక్షరాలా నిజం! అన్నీ ఆవిడ చెప్పిన విషయాలే!” అంది.

ఏదో జరగరానిది జరిగిపోయి నట్టు విచిత్రంగా, నిరాశగా అని పించ సాగింది నా మనసుకు.

“పిల్లవాడికి ఏదైనా అనా రోగ్యమా? పుట్టింటిలో వుంచటం ఎందుకు?”

“పిల్లవాడికి కాదు-అనారోగ్యం! ఆమెకే రోగం!” కమల గొంతులో జయశ్రీపట్ల ఏదో అసహ్యం ధ్వనించింది.

నేను ఇంకా ఆశ్చర్య పోసాగాను.

“జయశ్రీకి సినిమాలో యాక్టు చెయ్యాలని చాలా కోరికగా వుందట. తను ఫిలిం ఫీల్డులో ప్రవేశించాలని ఎంత ప్రయత్నిం చినా అవకాశం దొరకలేదుట.

తనకి సినిమా ఛాన్సు తగిలి ఏ క్షణంలోనైనా మద్రాసు వెళ్ళ వలసివస్తే బాబుతో కష్టం అవు తుందని పుట్టింటిలో వుంచుతూం దిట!”

“బాగుంది. తను సినిమా పిచ్చిలోపడి ఆ పసివాడిని తల్లి ప్రేమకు నోచుకోకుండా చేసిందన్న మాట! పాపం తల్లీ, తండ్రీ వుండీ ఆ బాలుడు అనాధలా అక్కడ పెరుగుతున్నాడా? ఎంత దారుణం? ఆమె తల్లి కాదు- రాక్షసి!” అన్నాను కోపంతో.

“ఇంకా వుంది-వినండి! కృష్ణ మోహన్‌గారు నాకు తెలుసు కాబట్టి, ఎలాగైనా రికమండ్ చేసి ఆయన దృష్టి తనమీద పడేలా చేయమని కోరింది. అసలు ఆయన దృష్టిలో పడాలనే ఉదయం ఇంటి ముందు గంటసేపు అలా ముగ్గు వేస్తూం దట. కృష్ణమోహన్‌గారు మేడ మీద బాల్కనీలో నుంచుంటే తను కనిపిస్తుందట. ఏనాటికైనా తాను ఆయన ద్వారానే ఫీల్డుకి ఇంట్ర డ్యూస్ కావాలని కోరికగా వుందట. చీరలు కట్టుకుంటే వయసు తెలిసి పోతుందని చిన్న పిల్లలా కన బడటం కోసం లంగాలు, ఓణీలు ధరిస్తూందట.”

“మరి తన రహస్యాలు ఇలా చెప్పుకుంటే ఎలా?”

"అందరితో ఎందుకు చెబుతుంది? నేను కృష్ణమోహన్‌కి రికమండ్ చేస్తానన్న ఆశతో వున్నదున్నట్టు నాకు చెప్పింది."

"బాగుంది. అయితే పుట్టిన బిడ్డనేకాక కట్టుకున్న మొగుణ్ణి కూడా తన సినిమా మోజుతో బాధ పెడుతూ వుండాలి. పాపం ఆ మానవుడు ఎంత ఇబ్బంది పడుతున్నాడో?" అన్నాను జాలిగా.

* * *

ఆ తరువాత ఓ సందర్భంలో జయశ్రీ భర్తతో మాట్లాడే అవకాశం కలిగింది.

రోజూ ముఖపరిచయం వున్నదే కాబట్టి, ఇబ్బంది లేకుండా త్వరలోనే అసలు విషయం ప్రస్తావించగలిగాను.

"అసలు జయశ్రీగారికి ఎప్పటినుండి ఇలా సినిమాలలో నటించాలని కోరిక కలిగింది?" అన్నాను.

"మా పెళ్ళికి ముందునుంచి వుంది— మా పెళ్ళి అయి అయిదేళ్ళు అయింది. అంతకు ముందు కాలేజీలో చదివేటప్పుడు ఏవో కల్చరల్ ప్రోగ్రామ్సులో పాల్గొన్నదట. తన నటనకు ప్రైజులుకూడా ఇచ్చారు."

"తరువాత?"

"తరువాత ఇంకేముంది? ఆ ప్రైజులు ముందుపెట్టుకుని తాను పెద్ద ఏక్టరు ననుకుంటుంది. దీనికితోడు ఇరుగు పొరుగువారు 'నువ్వు చాలా అందంగా, సినిమా యాక్టరులా వుంటావు' అని ఏవో ముఖస్తుతిగా అంటుంటే 'తాను నిజంగా సినిమాస్టారుకు తీసిపోను' అనుకుంటూంది. అలా క్రమంగా వ్యాధి ముదిరిపోయింది."

"ఏది ఏమైనా, మీరు ప్రారంభంలోనే ఆమెను ఈ విషయంలో నిరుత్సాహపరిచి వాస్తవం తెలియ చెప్పాల్సింది!"

"అన్నీ అయ్యాయి. 'ఆమెతో నేను కో ఆపరేట్ చేయకపోతే, తను విడాకులకు సిద్ధం' అని కూడా అంది. ఆమె ఏంచేసినా మా బాబుకి తల్లిగా ఆమెను భరిస్తున్నాను" అన్నాడు ఎంతో విషాదంగా.

అతని కష్టంలో ఎలా పాలు పంచుకోవాలో అంతు పట్టలేదు.

"అన్నట్టు మీకు ఈ విషయం తెలుసో, లేదో నా భార్య అసలు పేరు కనకదుర్గ! సినిమాకోసం జయశ్రీగా పేరు మార్చుకుంది" అన్నాడు అదోవిధంగా నవ్వుతూ.

అటువంటి పరిస్థితులలో కూడా అతను కాబట్టి నవ్వకలిగాడు కానీ, నాకు మాత్రం నవ్వు రాలేదు.

"ఆడది స్వర్గంతోపాటు నరకాన్ని కూడా సృష్టించగలదు." అన్న ఇంగ్లీషు కవి వాక్యాలు గుర్తు వచ్చాయి. ●